

బ్రాహ్మణులకు ప్రత్యేక స్థానం

రాష్ట్రంలో బ్రాహ్మణ పరిషత్ స్థాపనతో బ్రాహ్మణ కులస్తులకు సముచిత స్థానం లభించిందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. - 8లో▸



రూ.10లక్షల గంజాయి పట్టివేత

కాజీపేటలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.10లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$27^0/24^0$

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఉరుములు మెరుపులతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయి.

న్యూస్‌రీల్

పంటలను పరిశీలించిన డీఏఓ



దుగ్గొండి: మండలంలోని అడవిరంగాపురం గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(డీఏఓ) ఉషాదయాళ్ బుధవారం పర్యటించారు. మొక్కజొన్న, పత్తి, వరినాట్లను పరిశీలించారు. అధిక వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నాటువేసే కూలీలతో మాట్లాడారు. గట్ల వెంట నడిచిన డీఏఓకు మహిళా రైతులు జాగ్రత్తలు చెబుతూ చేతికి కర్రను అందించారు. అనంతరం ఆమె మాట్లాడారు. అధిక వర్షాలతో నాటు వేస్తే కొట్టుకుపోతుందని, వర్షాలు తగ్గేవరకు ఆగాలని సూచించారు. నాటు వేసే వారం రోజుల ముందు నారుమడికి కార్బోఫ్యూరాన్ గుళికలు వేస్తే గొట్టం పురుగు ఆశించకుండా ఉంటుందన్నారు. పత్తి మొక్కలు అధిక నీటిని తట్టుకోవని, గండ్లు పెట్టి నీటిని తీసివేయాలన్నారు. వర్షాల వల్ల కలుపు విపరీతంగా పెరిగిందని, నివారణ కోసం వానలు తెరిపిచ్చాక లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల పారాక్వ్యాట్‌క్లోరైడ్, 10 గ్రాముల యూరియా కలిపి టోపన్ పెట్టి పత్తి మొక్కలపై పడకుండా పిచికారీ చేయాలని చెప్పారు. ఇట్‌వీడ్ మాక్స్ మందును పత్తి మొక్కలపై పిచికారీ చేస్తే సన్నజాతి ఆకులు, వెడల్పాటి ఆకుల జాతి కలుపు మొక్కలు నశిస్తాయని ఆమె సూచించారు. వర్షాలు తగ్గిన తర్వాత లీటరు నీటికి 10 గ్రాముల మల్టీకే లేదా 19-19-19ను కలిపి పిచికారీ చేయాలన్నారు. అవసరాన్ని బట్టి ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలని ఆమె సూచించారు. డీఏఓ వెంట ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం ప్రతినిధి సారంగం, ఏఈఓ మధు, సర్పంచ్ కొండం రమాదేవి ఉన్నారు.

ఓటరు నమోదులో బీఎల్‌ఓలు కీలకం



నెక్కొండ: ఓటర్ల తుది జాబితా తయారీపై దృష్టి సారిస్తున్నట్లు జిల్లా ఎలక్షన్ మాస్టర్ ట్రైనర్ రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని విద్యోదయ గురుకుల పాఠశాలలో బుధవారం ఓటరు నమోదుపై బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటరు నమోదులో బీఎల్‌ఓలే కీలకమని ఆయన చెప్పారు. 6,7,8 దరఖాస్తుల గురించి వివరించారు. వంద శాతం ఓటింగ్ నమోదయ్యేలా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కొత్త ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగించే ఓటర్లను ఇంటి నంబర్ల వారీగా నమోదు చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కు లేని వారు ఆన్‌లైన్ చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఓటరు జాబితాలో తప్పులు దొర్లకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు వెంకట్రావు, సంపత్, తహసీల్దార్ డీఎస్ వెంకన్న, నయాబ్ తహసీల్దార్ కన్నె రాజ్‌కుమార్, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి



నర్సంపేట: గ్రామీణ వ్యవసాయ కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని సంఘం కార్యాలయంలో నమిండ్ల స్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ గ్రామీణ వ్యవసాయ కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతన చట్టాన్ని సవరించకపోవడం సరికాదని, వారిపై కపట ప్రేమ ప్రదర్శిస్తోందన్నారు. కలుపు, నాటు పనులకు గ్రామాల్లో రూ.200 నుంచి రూ.400, గుత్తా నాటుకు రూ.4వేలు మాత్రమే ఇస్తూ వ్యవసాయ కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వ్యవసాయ కార్మికులకు వర్తించడం లేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బోళ్ల సాంబయ్య, వ్యవసాయ కార్మిక సంఘం దుగ్గొండి మండల కార్యదర్శి పుచ్చకాయల నర్సింహారెడ్డి, వెంకన్న, మాదాసి యాకూబ్, మొగులోజు శారత, ఇస్లావత్ రవి, కొత్తపల్లి మాధవి, కవిత, రాసమల్ల రజిత, ధారా లక్ష్మి పాల్గొన్నారు.

జోరు వాన

జిల్లాలో సగటు వర్షపాతం 63.34 మిల్లీమీటర్లు

- వరంగల్ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయం
- అలుగు పోస్తున్న చెరువులు.. ప్రవహిస్తున్న వాగులు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ఇబ్బందులు పడిన ప్రజలు





సంగెం : ఉధృతంగా మత్తడి పోస్తున్న ఎల్గూరు రంగంపేట చెరువు. (ఇన్‌సెట్‌లో) పర్వతగిరి : జమాల్‌పూర్ రోడ్డు వద్ద కూలీలను దాటిస్తున్న ఎస్సై వీరభద్రరావు

కరీమాబాద్: జిల్లాలో వర్షం జోరు కొనసాగుతోంది. బుధవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 63.34 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. పర్వతగిరిలో 90 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. భారీ వర్షంతో వాగులు వంకలు నీటి ప్రవాహంతో ఉరకలెత్తుతుండగా.. చెరువులు, కుంటలు మత్తడి పోస్తున్నాయి. కుండపోత వానతో వరంగల్ నగరంలోని లోతట్టు ప్రాంతాలతోపాటు నర్సంపేట, వర్ధన్నపేట డివిజన్ల పరిధిలోని పలు గ్రామాలు జలమయమయ్యాయి. కాలనీలతోపాటు ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో జనజీవనం అతలాకుతలమవుతోంది. పలు గ్రామాల మధ్య ఉన్న కాజ్‌వేలపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వరంగల్ నగరంలోని సాకరాశికుంట, ఉర్సు కరీమాబాద్, కీర్తి బార్ ప్రాంతం, ఎస్‌ఆర్‌ఆర్ తోట, డీకేనగర్, మల్లు స్వరాజ్యంనగర్, జక్కలొద్ది, రంగశాయిపేట, గణేష్‌నగర్, సాయినగర్, మామునూరులోని పలు ప్రాంతాలు జలమయంగా మారాయి. ముంపు ప్రాంతాలను మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ అధికారులు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి సందర్శించారు. నాలాలను పరిశీలిస్తూ వరద నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం ఉంటే తప్ప ఇళ్లలో నుంచి బయటకు రావొద్దని కోరారు. 43వ డివిజన్ మంగళకుంటలోని నివాసాలకు వరదనీరు చేరడంతో కార్పొరేటర్ ఈదురు అరుణ చొరవ తీసుకుని మున్సిపల్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి సుమారు 300 మందికి భోజనాలు పెట్టారు. ఉర్సు చెరువు నిండుకుండలా మారి మత్తడి పోస్తోంది. నర్సంపేట పట్టణంలోని ఎన్టీఆర్ నగర్, సర్వాపురం కాలనీలో వరదనీరు ఇండ్లలోకి, గెస్ట్‌హౌస్ నుంచి మార్కెట్‌కి వెళ్లే దారి, మల్లంపల్లికి వెళ్లే హైవేపై నిలువడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. నర్సంపేట మండలంలోని మాదన్నపేట పెద్దచెరువు మత్తడి పోస్తుండడంతో నర్సంపేట-నల్లబెల్లి ప్రధాన రహదారిలోని కాజ్‌వేపై నీరు ఉధృతంగా ప్రవహిస్తూ రాకపోకలు నిలిచిపోయాయి. నల్లబెల్లి మండలంలోని రంగాయ చెరువులో భారీ నీరు చేరడంతో మత్తడి వద్ద పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ మంజుల చెరువును సందర్శించారు. దుగ్గొండి మండలంలోని పీజీ తండా జలమయం కావడంతో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు నీటిమట్టం 24 అడుగులకు చేరింది. వర్ధన్నపేటలోని ఆకేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. చెన్నారావుపేట, ఖానాపురం, వర్ధన్నపేట, రాయపర్తి, సంగెం, గీసుకొండ మండలాల్లోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.



సంగెంలో కోతకు గురైన కల్వర్టు



నర్సంపేట మండలం గురిజాల కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరదనీరు

బాధితులను ఆదుకుంటాం : ఐటీడీఏ పీఓ

ఖానాపురం : భారీగా కురుస్తున్న వర్షాలతో ఇళ్లు కూలిపోయిన వారిని ఆదుకుంటామని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండలంలోని మంగళవారిపేటలో వర్షాలతో కూలిపోయిన ఇండ్లను బుధవారం పరిశీలించారు. ఇళ్లు కూలిపోయిన వారి వివరాలు సేకరించి పంపించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారీగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనవసరంగా బయటకు వెళ్లవద్దని, వాగులు దాటకూడదని పేర్కొన్నారు. చేపల వేటలకు వెళ్లవద్దని, సమస్యలు తలెత్తితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ సుభాషిణి, ఎంపీడీఓ సుమనవాణి, ఆర్‌ఐ సత్యనారాయణ, సర్పంచ్ బాలకిషన్, గొంది నాగేశ్వర్‌రావు, స్థానికులు రజి త,సుజాత,శ్రీను, సమ్మక్క, నర్సయ్య ఉన్నారు.



ముంపు బాధితులతో మాట్లాడుతున్న పీఓ అంకిత్






నల్లబెల్లి : రంగాయ చెరువు మత్తడిని పరిశీలిస్తున్న తహసీల్దార్ దూలం మంజుల, మత్తడి పోస్తున్న వరంగల్‌లోని ఉర్సు చెరువు

బుధవారం ఉదయం 8:30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నమోదైన వర్షపాతం

మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లలో)
వరంగల్	51.5
ఖిలావరంగల్	50.5
గీసుకొండ	48.8
దుగ్గొండి	56.5
నల్లబెల్లి	59.8
నర్సంపేట	65.8
ఖానాపురం	65.0
చెన్నారావుపేట	58.8
సంగెం	72.5
వర్ధన్నపేట	41.0
రాయపర్తి	84.8
పర్వతగిరి	90.0
నెక్కొండ	78.5

పాకాల సరస్సులో 24 ఫీట్ల నీటమట్టం

ఖానాపురం: ధాన్యాగారానికి ప్రధాన నీటి వనరు అయిన పాకాల సరస్సులో 24 ఫీట్లకు నీటిమట్టం చేరుకుంది. పూర్తిస్థాయి నీటిమట్టం 30.3 ఫీట్లు. మరో 6.3 ఫీట్ల నీరు చేరితే మత్తడి పోయనుంది. ఎగువ ప్రాంతం నుంచి వరద పోటెత్తుతుండటంతో ససరస్సులోకి నీరు భారీగా చేరుతోంది. దీంతో సరస్సు నిండుకుండలా కనిపిస్తోంది.



జలకళ సంతరించుకున్న పాకాల

అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు

పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్



వరంగల్ క్రైం: భారీ వర్షాల దృష్ట్యా కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువల, చెరువుల వద్దరు వెళ్లవద్దని, చెట్ల కింద, పాడైన భవనాల కింద ఉండవద్దని సూచించారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి గుంతలు ఏర్పడుతున్నాయని, అందులో నీరు నిల్వ ఉండడంతో వాహనదారులకు కనిపించక ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని తెలిపారు. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదని సూచించారు. ప్రజలకు సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కు ఫోన్ చేసి పోలీస్ సహాయం పొందాలని తెలిపారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి - 8లో▸
- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్ రావు

గుండె'జల్లు'.. - 8లో▸
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనజీవనం అస్తవ్యస్తం

ఉప్పొంగిన గోదావరి - 10లో▸
- ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు

- మరిన్ని ఫొటోలు 9లో▸



సంగెం మండలం నల్లబెల్లిలో కుంగిన చెరువు కట్ట

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సమస్యలు తలెత్తితే 9154252936 నంబర్‌కు ఫోన్ చేయాలి

- 24 గంటలు అందుబాటులో కంట్రోల్ రూం సిబ్బంది
- కలెక్టర్ ప్రావీణ్య
- వర్షాల నేపథ్యంలో అధికారులతో సమీక్ష

కరీమాబాద్: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వాగులు, చెరువులతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి ప్రవాహం ఉన్న వంతెనలు, రోడ్ల మీద ప్రజలు ప్రయాణాలు చేయకుండా చూడాలన్నారు. ప్రజలు కూడా పొంగిపొర్లుతున్న వాగులు, వంకల వద్ద ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని, వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు రోడ్డు దాటేందుకు సాహసం చేయవద్దని సూచించారు. ఎవరూ చేపల వేటకు వెళ్లవద్దని కోరారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే మండల, జిల్లాస్థాయి అధికారులకు తెలియజేయాలని, కూలిపోయే ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూం నంబర్ 9154252936కు ఫోన్ చేయాలని సూచించారు. కంట్రోల్ రూం సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

రోడ్లు, రైల్వే లైన్ల భూసేకరణపై ఢిల్లీ నుంచి సమీక్ష..

జిల్లాలో పురోగతిలో ఉన్న రోడ్లు, లిఫ్ట్ ఇరిగేషన్, రైల్వేలైన్లకు సంబంధించిన భూసేకరణపై బుధవారం కేంద్ర క్యాబినెట్ సెక్రటేరియట్ సమన్వయ కార్యదర్శి విజయ్‌తివాన్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ గీసుకొండ, సంగెం, ఖిలావరంగల్, నెక్కొండ మండలాల మీదుగా నిర్మించనున్న రైల్వే మూడో లైన్ భూసేకరణకు సంబంధించి 32.33 హెక్టార్లకు 27.49 హెక్టార్లు పూర్తిచేయగా మిగతా 4.84 హెక్టార్ల భూసేకరణ ప్రక్రియను సెప్టెంబర్ 30 లోగా పూర్తి చేస్తామని చెప్పారు. రాయపర్తి, వర్ధన్నపేట, నల్లబెల్లి, దుగ్గొండి, నర్సంపేట మండలాలకు సంబంధించి దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్‌కు 395.22 ఎకరాలకు 69.27 ఎకరాల భూ సేకరణ పూర్తికాగా.. మిగిలినది అక్టోబర్ 31 లోపు పూర్తి చేస్తామని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీవత్స, ఆర్డీఓ వాసుచంద్ర పాల్గొన్నారు.



భారీ వర్షాలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

సీఎస్ సెల్ కాన్ఫరెన్స్..

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాల పరిస్థితులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్ని జిల్లాల కలెక్టర్లతో సెల్ కాన్ఫరెన్స్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ షేక్‌రిజ్వాన్‌బాషా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లతో కలెక్టర్ గూగుల్ మీట్ కాన్ఫరెన్స్..

కలెక్టర్ ప్రావీణ్య తహసీల్దార్లతో గూగుల్ మీట్ నిర్వహించారు. దెబ్బతిన్న ఇళ్ల వివరాలు, కోతకు గురైన రోడ్లు, కల్వర్టుల పరిస్థితి, నిండిన చెరువుల వివరాలు, ప్రాణ, పంట నష్టం వివరాలు, తాగునీటి సరఫరా, కరెంట్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం తదితర అంశాలపై తహసీల్దార్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న 72 గంటలు చాలా ముఖ్యమని, ప్రజలు అవసరమైతే తప్ప ఇళ్లలో నుంచి బయటకు రావొద్దని కోరారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో హెచ్చరికలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ శ్రీవత్స, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డీపీఓ కల్పన, అధికారులు పాల్గొన్నారు.

బోధనా ప్రణాళికతో అభ్యసనం సులభం

- డీఈఓ వాసంతి

కాశీబుగ్గ సెంటర్: ఉపాధ్యాయుల బోధనా ప్రణాళికల ద్వారా విద్యార్థుల అభ్యసన సులభం అవుతుందని డీఈఓ వాసంతి అన్నారు. వరంగల్‌లోని ఏవీవీ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులకు నిర్వహించిన తొలిమెట్టు శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ వాసంతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు జిల్లాస్థాయి శిక్షణలో నేర్చుకున్న అంశాలను మండలస్థాయి ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణలో వివరించాలని తెలిపారు. దీంతో తొలిమెట్టు కార్యక్రమం ద్వారా పిల్లల్లో ఆశించిన అభ్యసన ఫలితాలు సాధించగలమన్నారు. ఉపాధ్యాయులకు విద్యాశాఖ అందించే బోధనా ప్రణాళికల ద్వారా అభ్యసన సులభమైందని, అదేవిధంగా అభ్యసన పుస్తకాలు పిల్లలతో చదివించడం, రాయించడం ద్వారా సామర్థ్యాల సాధన సులభం అవుతుందన్నారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో బహుళ తరగతి, బహుళ స్థాయి బోధన అమలు చేయాలని చెప్పారు. సెక్టోరియల్ అధికారి సారయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులందరికీ శిక్షణ కార్యక్రమ లక్ష్యాలు చేరితే విద్యార్థులు తరగతి గదిలో నైపుణ్యాలు పెంచుకుంటారని, ఫలితంగా రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రగతి ఉంటుందన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులతో డీఈఓ వాసంతి తొలిమెట్టు అమలుకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వరంగల్ ఎంఈఓ ఎస్.విజయ్‌కుమార్, ఉర్దూ శిక్షణ కోర్సు డైరెక్టర్ జి.అశోక్‌కుమార్, రాష్ట్ర పరిశీలకులు ఏవీఆర్. చార్యులు, రాష్ట్ర, జిల్లా రిసోర్స్ పర్సన్స్, సీఆర్పీలు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

వర్షంలోనూ వరినాట్లు



రాజుపేట శివారులో వరినాట్లు వేస్తున్న మహిళలు

నర్సంపేట రూరల్: నర్సంపేట మండల రాజుపేట గ్రామ శివారులోని వ్యవసాయ భూముల్లో బుధవారం కూలీలు వరినాట్లు వేశారు. భారీ వర్షాలతో చెరువుల్లోకి సమృద్ధిగా నీరు చేరుతుండడంతో నాటు వేసేందుకు ఆయకట్టు రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయ కూలీలు పనుల్లో బిజీబిజీగా కనిపిస్తున్నారు.

నిధుల కేటాయింపులో వివక్ష

నర్సంపేట: నర్సంపేట మునిసిపాలిటీలో నిధుల వివక్ష కొనసాగుతోందని, అభివృద్ధి పనులకు నిధులను సమానంగా కేటాయించాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జరిగిన సాధారణ సమావేశంలో వారు డీసెంట్ నోట్ అందజేశారు. చైర్‌పర్సన్, కమిషనర్ పోడియం వద్ద బైఠాయించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనుల కోసం కేటాయించిన రూ.4 కోట్లలో రూ.60 లక్షలు మాత్రమే కాంగ్రెస్ కౌన్సిలర్ల వార్డులకు కేటాయించారని తెలిపారు. పట్టణంలోని ప్రజలందరూ పన్ను చెల్లిస్తున్నారని, బీఆర్‌ఎస్ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే సూచనల మేరకు తమ ప్రాంతాలకు నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. ప్రజలందరూ చైర్‌పర్సన్‌కు సమానమే అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు తప్ప అభివృద్ధిలో కలిసికట్టుగా పనిచేస్తేనే ప్రజల ఆశీస్సులు ఉంటాయన్నారు. సమాన నిధుల కేటాయింపు విషయంలో కలెక్టర్, సీడీఎంఏ దృష్టికి తీసుకెళ్లి కమిషనర్, చైర్‌పర్సన్‌పై చర్యలకు డిమాండ్ చేస్తామని పేర్కొన్నారు. నర్సంపేట మునిసిపాలిటీ సాధారణ నిధుల నుంచి తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు రూ.11 లక్షలు కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎలకంటి విజయ్‌కుమార్, బత్తిని రాజేందర్, ములుకల వినోదసాంబయ్య, పెండెం లక్ష్మీరామానంద్, ఓర్సు అంజలిఅశోక్‌కుమార్ పాల్గొన్నారు.



పోడియాన్ని ముట్టడించి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

యువకుడి ఆత్మహత్య


అనిల్ (ఫైల్)

నర్సంపేట రూరల్ : పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు నర్సంపేట టౌన్‌సీఐ పులి రమేష్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామ శివారులోని అమృతండాకు చెందిన భూక్యా రాజేందర్–భద్రమ్మ దంపతుల కుమారుడు భూక్యా అనిల్ (18) నర్సంపేట పట్టణంలో ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. కళాశాలకు సక్రమంగా వెళ్లడంలేదని, చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో క్షణికావేశానికి లోనై బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనిల్ గతంలో కూడా రెండుమార్లు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చెన్నారావుపేట: మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన నీరటి రమేష్(47) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. రమేష్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 15 సంవత్సరాల క్రితం నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లికి చెందిన సునీతతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఉన్నాడు. రమేష్ మద్యానికి బానిసై భార్య, కుమారుడిని పట్టించుకోకపోవడంతో భార్య సునీత పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో రమేష్ అధికంగా మద్యం సేవిస్తుండంతో తండ్రి ఐలయ్య మంగళవారం మందలించాడు. మనస్తాపానికి గురైన రమేష్ ఇంట్లో పురుగుల మందు తాగాడు. చుట్టు పక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. రమేష్ తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేయూకు నేడు సెలవు

- అన్ని పరీక్షలు వాయిదా



కేయూ క్యాంపస్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌తోపాటు, వర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని వర్సిటీ అనుబంధ కళాశాలలకు కూడా ఈనెల 27వ తేదీని సెలవుగా ప్రకటించారు. అలాగే, యూనివర్సిటీ పరిధిలో ఈ ఈ నెల 26, 27వ తేదీల్లో జరిగే వివిధ పరీక్షలను కూడా వాయిదా వేశారు.

వాయిదా పడిన పరీక్షలు ఇవే..

కేయూ పరిధిలో ఈ నెల 26న జరగాల్సిన (బుధవారం) బీఫార్మసీ 8వ సెమిస్టర్ పరీక్షలు, బీటెక్ (నాన్‌సీబీసీఎస్) మొదటి సంవత్సరం, నాలుగో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు, ఈనెల 27న జరగాల్సిన బీఫార్మసీ 8వ సెమిస్టర్ పరీక్షలు, బీటెక్ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేశామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు.మళ్లీ ఎప్పుడు నిర్వహించే తేదీలను తరువాత ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు.

గుండె'జల్లు'..

దంచికొడుతున్న వానలు..

- నీటమునిగిన పంటపొలాలు
- కూలిన ఇళ్లు..తెగిపోయిన రోడ్లు

ఆకాశానికి చిల్లు పండిదా అనేలా కురుస్తున్న వర్షాలకు గుండె'జల్లు'మంటోంది. ఉమ్మడి జిల్లాలో కొద్ది రోజులుగా కురుస్తున్న వానలకు కనుచూపు మేర నీరే కనిపిస్తోంది. చెరువులు మత్తళ్ల పరవళ్లు దూకుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పంటపొలాలు నీటమునిగి అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అలాగే, ఇళ్లు కూలిపోయి బాధితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వరద ప్రవాహానికి రహదారులు తెగిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మొత్తంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారుతోంది.

\- సాక్షి, నెట్‌వర్క్


ఎల్కతుర్తిలో నీటమునిగిన వరిపంట


కాజీపేట రూరల్:గుంతలు పడిన ఫాతిమా,దర్గా రోడ్డు


ఎల్కతుర్తిలో పత్తిపంటలో నిలిచిన వర్షపు నీరు


వాజేడు: నీట మునిగిన పొలాలు


వెంకటాపురం(కె): పాలెంలో కూలిన పెంకుటిల్లు


పలిమెల: కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ


చెన్నారావుపేట: బోజేర్వులో కూలిన ఇల్లు


చెన్నారావుపేట: గుంతలమయమైన రోడ్డు


ఆత్మకూరు : నీరుకుళ్లలో కూలిన ఇల్లు


సంగెం : తీగరాజుపల్లిలో కూలిన పెంకుటిల్లు


పర్వతగిరి: గండిపడిన జమాల్‌పూర్ రోడ్డు


స్టేషన్‌ఘన్‌పూర్: పాంనూర్‌లో మునిగిన పొలాలు


ఖిలా వరంగల్ : మధ్య కోటలో మునిగిన ఆకుకూర పంటలు


కాశిబుగ్గ : చింతా హరిజనవాడలో కూలిన ఇల్లు

ఆదివాసీ ఆణిముత్యం..

స్కాలర్ షిప్‌తో చదువుకుని.. అమెరికాలో ప్రొఫెసర్ స్థాయికి

- మారుమూల ఏజెన్సీ ఆదివాసీ యువకుడి ఘనత
- ఈనెల 28న అమెరికా వెళ్లనున్న ఈక ప్రభాకర్
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు


ల్యాప్‌టాప్‌లో తన ఎంపికను చూస్తున్న ఈక ప్రభాకర్

కొత్తగూడ : కడు పేదరికం.. తినడానికి అన్నం కూడా దొరకని పరిస్థితి. తండ్రి పని చేస్తేనే పూటగడిచేది. లేనిపక్షంలో పస్తులుండడమే. పైగా మారుమూల గ్రామం.. అందులో పాఠశాల కూడా లేని కుగ్రామం. ఇలాంటి తరుణంలో ఎవరికైనా చదువుకోవాలనే ఆలోచనే రాదు. ఏదైనా పని చేసుకుని బతకాలని భావిస్తారు. కానీ అలాంటి వారికి ఈ యువకుడు పూర్తిగా విరుద్ధం. చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించాడు. ఒక పక్క సమస్యలతో సహవాసం చేస్తూనే.. మరో పక్క అనుకున్న లక్ష్యాన్ని చేరుకుని పలువురికి ఆదర్శంగా నిలిచాడు. ఆయననే మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మారుమూల ఏజెన్సీ ఆదివాసీ గ్రామం దొరవారివేంపల్లికి చెందిన ఈక ప్రభాకర్. తాను ఎంచుకున్న విద్యలో ఖండాంతరాలు దాటి అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ అయోవాలో ప్రొఫెసర్‌గా పని చేసేందుకు ఎంపికయ్యారు. ఎర్ర బస్సు కూడా ఎరగని ఈ గ్రామం నుంచి అమెరికాకు వెళ్లడంపై గ్రామస్తుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈక పాపమ్మ–సమ్మయ్య దంపతుల ప్రథమ సంతానం ప్రభాకర్. తన ఎదుగుదల గురించి ఆయన మాటల్లోనే..

'పోడు వ్యవసాయం ఆధారంగానే మా కుటుంబ పోషణ గడిచేది. తినడానికే ఇబ్బంది పడే పరిస్థితి. గ్రామంలో పాఠశాల కూడా లేదు. 1989లో అప్పటి ఐటీడీఏ పీఓ బెస్ట్ అవైలెబుల్ పాఠశాలలకు విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. హాస్టల్‌కు వెళ్తే కనీసం అన్నం అయినా సరిగా దొరుకుతుందనుకునే పరిస్థితి ఉండేది. ఈ పరిస్థితిలోనే రాజేంద్ర కాన్వెంట్ హై స్కూల్‌లో సీటు వచ్చింది. పాఠశాల చదువులోనే మా తల్లి పాపమ్మ 1997లో మృతి చెందింది. ఈ ఘటనను దిగమింగుకుని పదో తరగతి పూర్తి చేశా. అనంతరం ఇంటర్ ఎల్‌బీ కళాశాల వరంగల్‌లో, కర్నూలు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో బీజెడ్‌సీ గ్రూపులో డిగ్రీ పూర్తి చేశా. వారణాసిలోని బనారస్ హిందూ యూనివర్సిటీలో బయో టెక్నాలజీలో పీజీ పూర్తి చేశా. బెస్ట్ అవైలెబుల్ స్కీం పూర్తయిన తరువాత ఐటీడీఏ నుంచి స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యా. ఆ స్కాలర్ షిప్‌తోనే డిగ్రీ, పీజీ పూర్తయింది. 2006 నుంచి 2013 వరకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డి పూర్తి చేశా. 2013 నుంచి 2017 వరకు సీఎస్‌ఐఆర్‌ఆర్‌ఏలో రీసెర్చ్ అసోసియేట్‌గా పని చేశా. ఇదే సమయంలో మండలంలోని ఈశ్వరగూడెం గ్రామానికి చెందిన రవళితో వివాహమైంది. పీహెచ్‌డీ ఫెలోషిప్‌లో భాగంగా 'టాటా ఇన్‌స్టిట్యూట్ ఫండమెంటల్ రిసెర్చ్'లో సంవత్సరం పని చేశా. అనంతరం గీతం యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరాను. అక్కడ ప్రొఫెసర్‌గా పని చేస్తూనే గత సంవత్సరం అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ అయోనాలో ప్రొఫెసర్‌గా అప్లికేషన్ చేశాను. నాలుగు దఫాలుగా జరిగిన ఇంటర్వ్యూల ఆధారంగా నన్ను ఎంపిక చే సి వీసా ఇచ్చారు. ఈనెల 28న అమెరికాకు వెళ్తు న్నా. ఖండాతరాలు దాటి ప్రొఫెసర్‌గా పనిచేసే అ వకాశం వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది'.

ఆదివాసీలకే ఆదర్శం..



చిన్న కారణాలతో విద్యను మధ్యలో వదిలేసి వెనుకబడిపోతున్న ఆదివాసీ యువతకు ప్రభాకర్ ఆదర్శంగా నిలిచారు. సరైన రోడ్డు కూడా లేని తమ గ్రామం నుంచి అమెరికా వెళ్లడం తమకు ఎంతో గర్వంగా ఉందని దొరవారివేంపల్లి గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు


టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు ఆస్కారమెక్కువగా ఉంటుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు తెలిపారు. రాష్ట్రంలో రాబోయే మూడు రోజులపాటు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఈ క్రమంలో విద్యుత్ వినియోగదారులు, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని బుధవారం ఆయన ఒక ప్రకటనలో సూచించారు. ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు తాకొద్దని సూచించారు. దుస్తులు ఆరేసే దండేలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. సర్వీస్ వైర్లు అతుకులు లేకుండా చూసుకోవాలన్నారు. రైతులు విద్యుత్ మోటార్లు, స్టార్టర్ల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లొద్దని, సమస్యలుంటే విద్యుత్ అధికారులు, ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల పరిధిలో విద్యుత్ పర్యవేక్షణ చేయడానికి కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నిరంతరాయంగా పని చేస్తుందని తెలిపారు. సమస్యలు, ఫిర్యాదులను 9440811244, 9440811245 నంబర్లకు ఫోన్ చేసి తెలపాలని కోరారు. అదే విధంగా టోల్ ఫ్రీ నంబర్ 1800 425 0028కు లేదా 1912కు ఫోన్ చేసి తెలపొచ్చన్నారు.

చుట్ట అంటుకుని..

- వృద్ధురాలి సజీవదహనం
- దేవరుప్పులలో ఘటన
- పోలీసులకు మృతురాలి కూతురి ఫిర్యాదు


ముత్తమ్మ (ఫైల్)

దేవరుప్పుల : ఓ వృద్ధురాలు దైనందిన అలవాటు ప్రకారం చుట్ట తాగి ఆర్పకుండా మంచంలో పెట్టి నిద్రించింది. తెల్లారే సరికి సజీవదహనమైంది. ఈ విషాదకర ఘటన బుధవారం మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రం కొత్తవాడలోని ఎస్సీ కాలనీకి చెందిన మాచర్ల ముత్తమ్మ (90)కు నలుగురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. భర్త 25 ఏళ్ల క్రితమే మృతి చెందగా, కొడుకు వెంకన్న బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలోనే వృద్ధాప్యానికి తోడు కొన్నేళ్లుగా పక్షవాత రావడంతో మంచానికే పరిమితమైంది. పెద్ద కూతురు ఎల్లమ్మ ఇదే కాలనీలో స్థిరపడడంతో ఆమె పర్యవేక్షణలో పక్క గదిలోనే ఉంచి సపర్యలు చేస్తున్నారు. రోజువారీగా మంగళవారం రాత్రి ఆమెకు భోజనం పెట్టి వెళ్లింది. భోజనం చేసిన అనంతరం అలవాటు ప్రకారం ముత్తమ్మ చుట్ట తాగి పూర్తిగా ఆర్పకుండా మంచంపైనే పెట్టింది. సరిగా నిప్పు ఆరని చుట్ట.. అంటుకోవడంతో పడకబట్టలతోపాటు వృద్ధురాలు సజీవ దహనమైంది. రాత్రి వర్షం పడడంతో పరిసరాలకు పొగ, మంటలు వ్యాప్తి చెందలేదు. బుధవారం ఉదయం రోజువారీగా తల్లికి సపర్యలు చేసేందుకు కూతురు ఎల్లమ్మ వెళ్లి చూసి సరికి కాలిపోయి విగత జీవిగా కనిపించింది. ఈ ఘటనపై మృతురాలి కూతురు ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

స్వరాష్ట్రంలో బ్రాహ్మణులకు ప్రత్యేక స్థానం

- రూ.232 కోట్ల నిధులతో సంక్షేమం
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

జనగామ: తెలంగాణ రాష్ట్రంలో బ్రాహ్మణ పరిషత్ స్థాపనతో బ్రాహ్మణ కులస్తులకు సముచిత స్థానం లభించిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సూర్యాపేట రోడ్డు ఎస్ఎస్ఎన్ గార్డెన్‌లో బుధవారం జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా ధూప దీప నైవేద్య సంఘం అర్చకుల ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డితో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బ్రాహ్మణ సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఏటా బడ్జెట్‌లో బ్రాహ్మణ సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటి వివిధ పథకాల అమలుకు రూ.232 కోట్లు కేటాయించిందన్నారు. నాడు 18 వందల ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులకు కేవలం రూ.2 వేల 500 వేతనం ఇవ్వగా.. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత 6 వేల 541 ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు రూ.10వేల వేతనం ఇస్తున్నారన్నారు. తెలంగాణలో బ్రాహ్మణ కులస్తుల జనాభా 3 నుంచి 4 శాతం ఉన్నప్పటికీ 10 శాతం రిజర్వేషన్ వర్తింపజేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా హైదరాబాద్‌లో 10 ఎకరాల స్థలంలో బ్రాహ్మణ సదనం నిర్మించినట్లు తెలిపారు. దేవుడి భూములు కూడా కబ్జాలకు గురికాకుండా కాపాడుతున్నామన్నారు. దేవాలయాల నిర్వహణకు ఏడాదికి రూ.10 లక్షలు అందజేస్తున్నామన్నారు. స్పెషల్ డెవలప్ ఫండ్ ద్వారా రాష్ట్రంలోని 14 దేవాలయాల్లో వివిధ పనులు చేపట్టేందుకు రూ.107 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. బ్రాహ్మణ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న కేసీఆర్‌ను మూడోసారి భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమం సంఘం జిల్లా అధ్యక్షుడు త్రిపురారి మనోహర్ శర్మ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిందిపోలు నాగ దక్షిణామూర్తి, ప్రధాన కార్యదర్శి అన్నావజ్ఝల ప్రసాద్ శర్మ, కోశాధికారి నందనం హరికిషన్, కన్వీనర్ గోపి కృష్ణమాచార్యులు, కృష్ణమాచార్య సిద్ధాంతి, పాగాల మఠం సాయి శివప్రసాద్, చండీశ్వర్, ఎల్లంబట్ల కరుణాకర్, త్రిపురారి ప్రభుదత్తు, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

జనశక్తి మాజీ నేత మృతి


శ్యాం(ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేటహవేలిలో జనశక్తి మాజీ నేత పంజాల శ్యాం (58) అలియాస్ కిరణ్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. అతని భార్య శారద ఉద్యమ సహచరిగా ఉంటూ కిడ్నీలు ఫెయిల్ అయ్యి గతంలోనే చనిపోయింది. శ్యామ్‌కు పక్షవాతం రాగా ఇంటివద్దే ఉంటున్నాడు. ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలో ఆయన జనశక్తి పాలకుర్తి ఏరియా దళ డిప్యూటీ కమాండర్‌గా పని చేశారని గ్రామస్తులు తెలిపారు. ఆయనకు కూతురు ఉంది. 1991 నవంబర్ 26న శాయంపేటహవేలి సర్పంచ్, సీపీఐ(ఎంఎల్) జనశక్తి (అప్పట్లో చంద్రపుల్లారెడ్డి వర్గం) పార్టీ అనుబంధ రైతు కూలీ సంఘం నాయకుడు దాడి వెంకటయ్యను ప్రత్యర్థులు వరంగల్ బస్టాండ్‌లో బస్సులో ఉండగా రివాల్వర్‌తో కాల్చి చంపారు. దీనికి ప్రతీకార చర్యగా గ్రామంలో టీడీపీ సానుభూతిపరుడు ఇట్టబోయిన ఇద్దయ్య అనే వ్యక్తిని పీడీఎస్‌యూ (అప్పటి చంద్రపుల్లారెడ్డి వర్గం) కార్యకర్తలు హత్య చేశారు. ఈ కేసులో శ్యాం ప్రధాన నిందితుడు. ఈ రెండు హత్యలు అప్పట్లో జిల్లాలో సంచలనం రేపాయి. కాగా శ్యాం మృతి చెందడంతో అప్పటి ఆయన సహచర మిత్రులు, గ్రామస్తులు సంతాపం తెలిపి నివాళులు అర్పించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


బొండయ్య (ఫైల్)

వెంకటాపురం(కె): మండలంలోని సీతారాంపురం పెద్దవాగులో గల్లంతైన బొండయ్య (61) మృతదేహం లభ్యమైంది. మంగళవారం చేపల వేటకు వెళ్లి గల్లంతైన బొండయ్య ఆచూకీ కోసం గ్రామస్తులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మృతదేహం బుధవారం వాగు ఒడ్డుకు చేరుకుంది. దీంతో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, గ్రామస్తులు మృతదేహాన్ని వాగు నుంచి బయటకు తీశారు. కాగా, ఘటనా స్థలికి వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతి రావు, రెవెన్యూ అధికారులు చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

రూ.10లక్షల గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కాజీపేట: కాజీపేట పట్టణంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి వద్ద నుంచి రూ. 10లక్షల విలువైన 43 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ చంద్రమోహన్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన లకం అర్జున్, షేక్ సోహెల్.. ఆంధ్రప్రదేశ్‌లో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి కాజీపేటకు చేరుకున్నారు. ఫాతిమానగర్ టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్నారు. దీంతో ఎక్సైజ్ పోలీసులు వారిని ఆపి బ్యాగులు తనిఖీ చేయగా 43 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో వారిని అరెస్ట్ చేసినట్లు సీఐ చంద్రమోహన్ తెలిపారు. కాగా, గంజాయి రవాణా చేస్తున్న నిందితులను పట్టుకున్న సీఐ చంద్రమోహన్, ఎస్సైలు సౌమ్య, తిరుపతి, సిబ్బంది ఖలీల్, కోటి, వీరమల్లు, రషీద్, రవీందర్, వెంకటరమణ, ఆయూబ్, లాలయ్యను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ అభినందించారు.

కాజీపేట జంక్షన్‌లో భారీగా గంజాయి పట్టివేత

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో బుధవారం రైల్వే పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. రైలులో గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి సుమారు 68 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు గురువారం వెల్లడించనున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.